# నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I హైదరాబాద్, శనివారం 26 ఏప్రిల్ 2025 SIDDIPET




సిద్దిపేట నుంచి ఎల్కతుర్తి రజతోత్సవ సభకు పాదయాత్రగా వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, యువత

## వడ్ల కొనుగోలులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం

- విక్రయించి పదిరోజులైనా రైతుల ఖాతాల్లో డబ్బులు పడడం లేదు..
- అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- పాలమాకులలో వడ్ల కొనుగోలు కేంద్రం విజిట్



పాలమాకులలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు, ఏప్రిల్ 25: ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంతో రైతులు నష్టపోతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం నంగునూరు మండలం పాలమాకులలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి వడ్ల కొనుగోలుపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు కల్పించిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని జిల్లాల్లో ఇప్పటికీ ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు అమ్ముకుంటున్నట్లు తెలిపారు. క్వింటాలుకు మద్దతు ధర రూ.2320 దక్కాల్సి ఉండగా, తక్కువ ధరకు రైతులు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలు, వడగండ్ల వానల భయంతో రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని దళారులకు అమ్ముకునే దుస్థితి ఉందన్నారు. గతేడాది వానకాలంలో 1.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని చెప్పి, కేవలం 52 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నదని విమర్శించారు. కాంగ్రెస్‌ది రైతు కంటక ప్రభుత్వం అని, రుణమాఫీ చేస్తామని చెప్పి సగం మందికి చేయలేదని, రైతుభరోసా వానకాలంలో ఎగగొట్టి యాసంగిలో మూడు ఎకరాలకే పరిమితం చేసిందని హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలకు 4 లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిన్నదని, ఎకరాకు రూ.20 వేల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే కలెక్టర్ల నుంచి నివేదిక తెప్పించుకొని రైతులను ఆదుకోవాలని కోరారు. పాలమాకుల వడ్ల కొనుగులు కేంద్రంలో వడ్లు కొని వారమైనా ఇంతవరకు రైతులకు డబ్బులు రాలేదన్నారు. మంత్రి ఉత్తమ్ మాత్రం 48 గంటల్లో రైతులకు డబ్బులను అకౌంట్లో వేస్తున్నట్లు చెప్పారన్నారు. గన్నీ బ్యాగులు నాణ్యంగా లేక హమాలీలు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట లింగంగౌడ్, జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, కోల రమేశ్, రాగుల సారయ్య, రవీందర్‌రెడ్డి, కుమార్ తదితరులు ఉన్నారు. అనంతరం పాలమాకులలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు.

## సాత్వికకు బాసటగా నిలిచిన హరీశ్‌రావు



సాత్వికకు రూ.2లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 25: తండ్రిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న చిన్నారి సాత్వికకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు బాసటగా నిలిచారు. ఇటీవల సిద్దిపేటలో నిర్వహించిన 'భద్రంగా ఉండండి.. భవిష్యత్తులో ఎదగాలి' అనే కార్యక్రమంలో సిద్దిపేట పట్టణానికి చెందిన నాగరాజు-విజయ దంపతుల కూతురు సాత్విక హాజరయ్యారు. స్వాతిక స్ప్రింగ్ డాల్ స్కూల్లో ఏడో తరగతి చదువుతున్నది. తండ్రిని కోల్పోయిన చిన్నారి సాత్విక ఈ కార్యక్రమంలో అమ్మానాన్నల గురించి వివరించే సమయంలో నాకు నాన్న లేడు.... నేను అమ్మను ఇబ్బంది పెడుతున్నా అని ఏడుస్తూ తన ఆవేదనను వెళ్లబుచ్చింది. దీంతో ఎమ్మెల్యే హరీశ్‌రావు చలించి భావోద్వేగానికి గురయ్యారు. అదేరోజు చిన్నారి సాత్వికకు అండగా ఉంటానని మాట ఇచ్చారు. ఈనెల 25న క్యాంపు కార్యాలయంలో టిఫిన్‌కు రావాలని సాత్విక తల్లిని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫోన్ చేసి ఆహ్వానించారు. ఇచ్చిన ఇచ్చిన మాటప్రకారం శుక్రవారం చిన్నారి సాత్వికతో పాటు తన తల్లి విజయను క్యాంపు కార్యాలయం పిలిపించుకొని వారితో భోజనం చేశారు. తన మిత్రుని సహాయంతో హైదరాబాద్ చెందిన వ్యాపారవేత్త తిరుమలరెడ్డి చిన్నారి విషయం తెలుసుకొని చిన్నారికి అండగా రూ. 2 లక్షల చెక్కును హరీశ్‌రావు చేతుల మీదుగా అందజేశారు. క్యాంపు కార్యాలయంలో చిన్నారి సాత్వికతో ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆప్యాయంగా మాట్లాడారు. మళ్లీ అమ్మను ఇబ్బంది పెడుతున్నావా.. ఇబ్బంది పెట్టొద్దు. అమ్మ ప్రేమ చాలా గొప్పది. నీవు మంచిగా చదువుకొని మంచి ఉద్యోగం సాధించినప్పుడు అమ్మకు ఎంతో ఆనందంగా ఉంటుంది.. నీవు అమ్మకిచ్చే గొప్ప బహుమానం అదే అని అన్నారు. భవిష్యత్తులో చదువుతో పాటు ఇతర ఏ ఇబ్బందులున్నా తాను అండగా ఉంటానని హరీశ్‌రావు భరోసానిచ్చారు.

## తెలంగాణలో రాక్షస పాలన




కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులకు కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే పల్లా

- బీఆర్ఎస్ సత్తాచాటాల్సిన సమయం ఆసన్నమైంది
- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 25: రాష్ట్రంలో సుస్థిర పాలన పోయి రాక్షస పాలన వచ్చిందని, కాంగ్రెస్ 50 ఏండ్లలో చేయని అభివృద్ధిని కేసీఆర్ పదేండ్లలో చేసి చూపించారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాలలోని ఓ ఫంక్షన్ హాలులో శుక్రవారం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే పల్లా ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ.. సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అందరినీ మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ సర్కారుపై ప్రజలు విరక్తి చెందారని, తిరిగి కేసీఆర్ అధికారంలోకి రావాలని ప్రజలంతా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈనెల 27న జరిగే రజతోత్సవ మహాసభను ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. బీఆర్ఎస్ సత్తా చాటాల్సిన సమయం అసన్నమైందన్నారు.కొమురవెల్లి మండల మర్రిముచ్చాల గ్రామ మాజీ సర్పంచ్ పద్మకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం చేర్యాల మండలంలోని ఆకునూరు నుంచి పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరడంతో వారికి గులాబీ కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీ, జడ్పీటీసీలు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, గ్రామశాఖల అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉద్యమ స్ఫూర్తితో ఎల్కతుర్తికి కదంతొక్కాలి



గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 25: ఈనెల 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభకు ప్రతి కార్యకర్త ఉద్యమ స్ఫూర్తితో తరలిరావాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గం నుంచి గ్రామానికి వంద మంది చొప్పున 15వేల మందిని 280 ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో వెళ్లేలేలా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. హరీశ్‌రావు ఆధ్వర్యంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసుకోవడంతో పాటు తొమ్మిది మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించుకొని దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి బయలుదేరే బస్సు సభా ప్రాంగణానికి రెండు గంటల ముందే చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని, కేసీఆర్ ప్రసంగం విన్న తర్వాత అక్కడి నుంచి తిరిగి వచ్చేలా గ్రామాల్లోని ముఖ్య కార్యకర్తలు చూసుకోవాలన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం అన్నింటా విఫలమైందని వారు విమర్శించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో చేసిన అభివృద్ధి, ఉద్యమ స్ఫూర్తి కనబడేలా ఉద్యమకారులు, కార్యకర్తలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జేజాల వెంకటేశంగౌడ్, రాజమౌళి, మాదాసు శ్రీనివాస్, కృష్ణారెడ్డి, నవాజ్‌మీరా, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బొల్లారం ఎల్లయ్య, దయాకర్‌రెడ్డి, రజిత, రమేశ్‌గౌడ్, హైదర్‌పటేల్, దేవేందర్, నాగిరెడ్డి, చందు, కనకయ్య, మన్నె వెంకటేశ్, అశోక్, మధుసూదన్‌రెడ్డి, శివకుమార్, మోహన్‌బాబు, కరీం, మురళి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమంతో.. మనది పేగుబంధం

- కాంగ్రెస్ అరాచకాలను ఎదిరించడానికి కదిలింది గులాబీదండు
- అంబేద్కర్,గాంధీజీ బాటలో నడిచి రాష్ట్రం సాధించినం
- బీఆర్ఎస్ ఎప్పుడూ తెలంగాణ ప్రజల పక్షమే
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- వరంగల్ రజతోత్సవ సభకు సిద్దిపేట యువత పాదయాత్ర
- జెండా ఊపి ప్రారంభించిన హరీశ్‌రావు
- వారితో కలిసి 6 కిలోమీటర్ల పాదయాత్ర
- గులాబీమయంగా మారిన సిద్దిపేట-హన్మకొండ రహదారి

### గులాబీజెండా పుట్టిందే సిద్దిపేట నుంచి.. యువత పాదయాత్ర బీఆర్ఎస్ విజయయాత్ర



సిద్దిపేటలో రంగధాంపల్లి చౌరస్తాలోని అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు



సిద్దిపేటలో జెండాను ఊపి పాదయాత్రను ప్రారంభించిన హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ ఉద్యమంతో సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉందని, గులాబీ జెండా పుట్టిందే సిద్దిపేట నుంచి అని, ఆనాటి కేసీఆర్ ఆమరణ దీక్ష ..2001లో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావమైన సిద్దిపేటతో తెలంగాణ ఉద్యమానికి పేగు బంధం ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని రంగధాంపల్లి అమరవీరుల స్తూపానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం వరంగల్ సభకు సిద్దిపేట నియోజకవర్గం నుంచి 1500 మంది యువత చేపడుతున్న పాదయాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. వారితో కలిసి దాదాపు 6 కిలోమీటర్లకు పైగా పాదయాత్రలో పాల్గొన్నారు. వారితో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి కాసేపు ముచ్చటించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ... సిద్దిపేట నుంచి ప్రారంభించిన యువత పాదయాత్ర రేపటి మన బీఆర్ఎస్ విజయయాత్ర కాబోతున్నదని జోస్యం చెప్పారు. ఈ సిల్వర్‌జూబ్లీకి మన పాదయాత్ర జైత్రయాత్ర కాబోతున్నదన్నారు. బీఆర్ఎస్ పుట్టినరోజు చాలామంది చాలారకాలుగా మాట్లాడారని, గాలిబుడగ, పాలపొంగు లాంటిదని.. అమావాస్యకు పుట్టింది.. పున్నానికి పోతదని హేళన చేశారన్నారు. హేలన చేసిన వారే ఆగమయ్యారని, వెక్కిరించిన పార్టీలే కనుమరుగయ్యాయని, కానీ.. బీఆర్ఎస్ పార్టీ ఆగం కాలేదన్నారు. దేశంలో చాలా పార్టీలు పుడుతుంటాయి..పోతుంటాయని.. కానీ, బీఆర్ఎస్ తన లక్ష్యాన్ని ముద్దాడిందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీ బీఆర్ఎస్ అని కార్యకర్తల హర్షధ్వానాల మధ్యన హరీశ్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అంబేద్కర్, గాంధీజీ బాటలో నడిచిన, శాంతియుత పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రం సాధించామని హరీశ్‌రావు గుర్తుచేశారు. బీఆర్ఎస్ ఎప్పుడూ తెలంగాణ ప్రజల పక్షాన ఉంటుందని, పద్నాలుగేండ్ల పాటు ఉద్యమం ..పదేండ్ల పాలన, సంవత్సన్నర ప్రతిపక్ష పాత్ర బీఆర్ఎస్ పోషించిన విషయాన్ని గుర్తుచేశారు. పదేండ్లలో బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్నిరంగాల్లో అద్భుత ప్రగతి సాధించిందన్నారు. అనేక పథకాలు, కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, ఆరుగ్యారెంటీలు ఇచ్చి ప్రజల్లో ఆశలు పెట్టి తీరా గద్దెనెక్కిన తర్వాత మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ గెలిచినప్పుడు పొంగిపోలేదు.. ఓడిపోయినప్పుడు కుంగి పోలేదన్నారు. ఓడినా.. గెలిచినా ప్రజల మధ్యనే ఉంటాం..ప్రజల కోసం పని చేస్తామని హరీశ్‌రావు చెప్పారు. ఇవాళ మనం చేసే పాదయాత్ర కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు కావాలన్నారు. ఆనాడు లంకలో రావణుడు చేసిన అరాచకాలను ఎదిరించడానికి రామదండు కదిలిందని..నేడు రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వ అరచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదిలిందని హరీశ్‌రావు అన్నారు. ఈ గులాబీ దండు మూడు రోజుల పాటు 70 కిలోమీటర్లు పాదయాత్ర చేసి బీఆర్ఎస్ రజతోత్సవ సభ స్థలాకి చేరుకుంటుందని తెలిపారు. పాదయాత్రలో భాగంగా గ్రామాల్లో రైతులను, అవ్వా తాతలను కలిసి ప్రతి ఒక్కరితో మాట్లాడి.. కాంగ్రెస్ పార్టీ అరాచకాలను వారికి వివరించాలని యువతకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ప్రజలందరూ మళ్లీ కేసీఆర్ రావాలని.. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. క్రమశిక్షణగా పాదయాత్ర చేపట్టాలని, ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం పాదయాత్ర ప్రారంభించాలని సూచించారు.

### అడుగడుగునా పోలీసు నిఘా..

బీఆర్ఎస్ చేపట్టిన యువత పాదయాత్రలో అడుగడుగునా పోలీసు నిఘా కనిపించింది. నిఘా అధికారులు పాదయాత్రలో కలిసి పోయి ఫొటోలు తీశారు. రంగధాంపల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్రను అనుసరిస్తూ ఎక్కడికక్కడ తమ సెల్ ఫోన్‌లలో ఫొటోలు, వీడియోలు తీస్తూ ఉన్నతాధికారులకు చేరవేశారు. హరీశ్ ప్రసంగం మొత్తం రికార్డు చేశారు. ఎంతమంది పాదయాత్రలో పాల్గొన్నారు. స్పందన ఎలా ఉంది తదితర అంశాలను ఆరాతీశారు.

### పులకరించిన పురిటిగడ్డ...

పురిటి గడ్డ సిద్దిపేట మరోసారి పులకరించింది. బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గంలోని దాదాపు రెండువేల మంది యువత పాదయాత్రగా శుక్రవారం ఎల్కతుర్తి సభకు బయలుదేరారు. పాదయత్ర రంగధాంపల్లి అమరవీరుల స్తూపం నుంచి ప్రారంభమైంది. అమరవీరుల స్తూపానికి హరీశ్‌రావు నివాళులర్పించారు. అక్కడి నుంచి పాదయాత్ర ప్రారంభం సందర్భంగా స్థానిక కౌన్సిలర్ వంగ రేణుకా తిరుమల్‌రెడ్డి తిలకం దిద్దిస్వాగతం పలికారు. 25 ఏండ్ల పార్టీ ఆవిర్భావం సందర్భంగా 25 మీటర్ల జెండా ప్రదర్శన చేపట్టారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పాటు సిద్దిపేటలో హరీశ్‌రావు చేపట్టిన అభివృద్ధి, ఉద్యమ సందర్భాలను గులాబీ జెండాలో ప్రదర్శించారు. పాదయాత్రకు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. సిద్దిపేట-హన్మకొండ 765డీ జాతీయ రహదారి గులాబీమయంగా మారింది. అన్ని గ్రామాల్లో పాదయాత్రకు ప్రజలు ఘన స్వాగతం పలికారు.

### పాదయాత్రకు ఊరూరా హారతులు

ఘన స్వాగతం పలికిన ప్రజలు .. గులాబీమయంగా మారిన రోడ్డు



నంగునూరు మండలం ముండ్రాయి వద్ద మంగళహారతులతో మహిళల స్వాగతం

సిద్దిపేట, ఏప్రిల్ 25: సిద్దిపేటలోని రంగధాంపల్లి అమరవీరుల స్తూపం నుంచి ఎల్కతుర్తి వరకు చేపడుతున్న యువత పాదయాత్ర శుక్రవారం ప్రారంభం కాగా, రాత్రి నంగునూరు మండలం బద్దిపడగకు చేరుకుంది. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి వద్ద ప్రజలు,బీఆర్ఎస్ శ్రేణులు పటాకులు కాల్చి పాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. పాదయాత్ర చేస్తున్న వారికి గ్రామస్తులు మజ్జిగను అందజేశారు. నంగునూరు మండలం ముండ్రాయిలో మాజీ సర్పంచ్ కమలాకర్‌రెడ్డి పాదయాత్రకు ఘన స్వాగతం పలికారు. గ్రామ మహిళలు మంగళహారతులు పట్టి, తిలకం దిద్ది స్వాగతం పలికారు. ముండ్రాయి స్టేజ్ వద్ద వారిపై గులాబీ పూలను చల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అక్కడి నుంచి పాదయాత్ర పాలమాకుల చేరుకుంది. పాలమాకుల వద్ద మధ్యాహ్నం భోజనం చేశారు. పాదయాత్రగా బయలుదేరిన విద్యార్థి యువజన విభాగం నాయకులతో ఎమ్మెల్యే హరీశ్‌రావు శుక్రవారం పాలమాకుల ఎల్లమ్మ దేవాలయం వద్ద గల ఫంక్షన్ హాల్‌లో వారితో మధ్యాహ్నం భోజనం చేసి ముచ్చటించారు. మీ పాదయాత్ర భవిష్యత్తు గులాబీ జెండా విజయయాత్ర అవుతుందని అన్నారు. క్రమశిక్షణతో పాదయాత్ర చేస్తూ సభాస్థలికి చేరుకోవాలని, రోడ్డుపై నడిచేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



సిద్దిపేట నుంచి ఎల్కతుర్తికి పాదయాత్ర చేపడుతున్న బీఆర్ఎస్ శ్రేణులు



నంగునూరు మండలం పాలమాకులలో హరీశ్‌రావుతో విద్యార్థి యువజన నాయకులు

## మెతుకు సీమ.. గులాబీ కంచుకోట

- రజతోత్సవ సభకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి భారీగా తరలిరావాలి
- మన సత్తాచాటుదాం..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ఉమ్మడి మెదక్ జిల్లా పార్టీ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో టెలీ కాన్ఫరెన్స్

సిద్దిపేట, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఈనెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభలో పెద్ద ఎత్తున పాల్గొని, విజయవంతం చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇది ఎంతో ముఖ్యమైన సభ అని, దీన్ని విజయవంతంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లాలోని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర నాయకులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు, ఇది యావత్ తెలంగాణకు పండుగ అన్నారు. తెలంగాణలోని ప్రతి ఒక్కరి విజయోత్సవంగా దీనిని అభివర్ణించారు. సుదీర్ఘకాలం పాటు అలుపెరుగని పోరాటం చేసి స్వరాష్ట్రం సాధించినా, పదేండ్లలో తెలంగాణను అభివృద్ధి పథంలో నిలిపినా అది కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకే సాధ్యమైందని పేర్కొన్నారు. అంతటి ఘన చరిత్ర కలిగిన పార్టీ 25 ఏండ్ల పండుగలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. వాహనాల ఏర్పాటు, నీటి వసతి, భోజనం సహా ఏ విషయంలోనూ కార్యకర్తలకు ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలన్నారు. వేసవి నేపథ్యంలో తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సాయంత్రం 5 గంటల్లోపు సభా స్థలికి వచ్చేలా బాధ్యత తీసుకోవాలన్నారు. సభ పూర్తయిన తర్వాత కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సురక్షితంగా ఇండ్లకు చేరేలా ఇన్‌చార్జిలు, నాయకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. సమన్వయంతో ఉంటూ, క్రమశిక్షణ పాటిస్తూ బహిరంగ సభను సక్సెస్ చేసి సత్తా చాటాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

## అకాల వర్షం.. అపార నష్టం

కొల్చారం, ఏప్రిల్ 25: అకాల వర్షం రైతులను కంటనీరు పెట్టిస్తున్నది. శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని కొంగోడ్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్ల కుప్పలు తడిశాయి. మండలంలో కొన్ని కేంద్రాల్లో లేబర్ కొరతతో ఇప్పటికీ తూకం ప్రారంభించలేదు. దీంతో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. నాయిని జలాల్‌పూర్, కొంగోడులో భారీ వర్షం కురియడంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కుప్పలు పూర్తిగా తడిచాయి. కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయమై కొంగోడు సొసైటీ సీఈవో సాయిరెడ్డిని వివరణ కోరగా.. మూడు రోజులుగా స్థానిక హమాలీల సహాయంతో ధాన్యం తూకం వేయిస్తున్నామని, శుక్రవారం అదనంగా బీహార్‌కు చెందిన హమాలీలు, కూలీలు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికీ లారీకి ఐదు వందల బస్తాల చొప్పున రెండు లారీల ధాన్యం తరలించినట్లు వివరించారు.

### మిరుదొడ్డిలో అకాల వర్షం

మిరుదొడ్డి, ఏప్రిల్ 25: మండల కేంద్రమైన మిరుదొడ్డితో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొండాపూర్, మిరుదొడ్డిలలో ఈదురు గాలులకు చెట్లు విరిగి రోడ్లకు అడ్డంగా పడ్డాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

### పిడుగుపాటుకు పాడిగేదెలు మృతి

తొగుట, ఏప్రిల 25: తొగుట మండలంలో శుక్రవారం కురిన అకాల వర్షానికి వర్ధరాజుపల్లిలో పిడుగు పడి రెండు పాడిగేదెలు మృతి చెందాయి. గుడికందులలో ఈతచెట్టుపై పిడుగు పడడంతో చెట్టుపై మంటలు చెలరేగాయి. పాడిగేదెల మృతిచెందడంతో రైతు ప్రసాద్‌కు రూ. లక్షా 20 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు.



### కేసీఆర్‌పై అభిమానంతో..

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం బురుగడ్డ గ్రామానికి చెందిన రవికుమార్ అనే యువకుడు కేసీఆర్‌పై ఉన్న అభిమానంలో రెండు రోజులుగా తన స్వగ్రామం నుంచి పాదయాత్రగా కేసీఆర్ సభకు బయలుదేరాడు. శుక్రవారం ఉదయం రవికుమార్ పాదయాత్ర సిద్దిపేట జిల్లా మిట్టపల్లికి చేరుకున్నది. – సిద్దిపేట, ఏప్రిల్ 25

## కేదార్‌నాథ్‌లో అన్నదానం గొప్ప సంకల్పం

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు



కేదార్‌నాథ్‌కు ఆహార పదార్థాలతో వెళ్లే వాహనాలకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 25: సిద్దిపేట సేవాపరులకు నిలయంగా విరాజిల్లుతోందని సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ మంజులా రాజనర్సు అన్నారు. కేదార్‌నాథ్‌కు ఆహార పదార్థాల వాహన పూజ, శివకల్యాణ మహోత్సవం స్థానిక శరభేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరై ఆమె మాట్లాడుతూ.. సిద్దిపేట కేధార్‌నాథ్ అన్నదానం సేవా సమితి మంచుకొండల్లో అన్నదానం చేయాలని సంకల్పిచడం గొప్పదన్నారు. అన్నదానానికి మించిన మహాదానం కలియుగంలో వేరే లేదన్నారు. దక్షిణ భారతదేశం నుంచి కేదార్‌నాథ్‌లో అన్నదానం చేస్తున్న ఏకైక సేవా సమితి సిద్దిపేట వారిది కావడం గర్వకారణమని మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్ అన్నారు. కేదారేశ్వరుని సన్నిధిలో అన్నదానం చేయడం దైవ సంకల్పం అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వేలేటి రాధాకృష్ణశర్మ అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, అన్నదాన సేవాసమితిసభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ భవిష్యత్తును నిర్ణయించే సభ

- పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి



పటాన్‌చెరు, ఏప్రిల్ 25 :బీఆర్ఎస్ పార్టీ ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభతో తెలంగాణ భవిష్యత్‌ను మారుస్తుందని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసే ప్రసంగం కోసం ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైనట్లు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రపురం, జిన్నారం, గుమ్మడిదల మండలాల నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు సభకు తరలి వస్తారని, దీని కోసం అన్ని ఏర్పాట్లు చేసినటుల తెలిపారు. సభకు సంబంధించి ఇప్పటికే నియోజకవర్గంలో వాల్ రైటింగ్, పోస్టర్లు, సన్నాహక సమావేశాలు పూర్తిచేసినట్లు తెలిపారు. ఎన్నికలొస్తే తెలంగాణలో కాంగ్రెస్ కనుమరుగు కావడం ఖాయమని, ఊరూరా గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో వెళ్లేందుకు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు సిద్ధమయ్యారని, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రతిరోజు దిశానిర్దేశం చేస్తున్నారని ఆదర్శ్‌రెడ్డి తెలిపారు.